క్లుప్తంగా

స్టోన్ క్రషర్ టిప్పర్ల అడ్డగింత

కొల్చారం(నర్సాపూర్): రాంపూర్ గ్రామ శివారు.. స్టోన్ క్రషర్ టిప్పర్లను సోమవారం కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ 22 ఏళ్ల క్రితం క్వారీ ఏర్పాటు సమయంలో యాజమాన్యం గ్రామంలో చేపట్టే ఇళ్ల నిర్మాణానికి సగం ధరకే కంకర ఇస్తామని ఒప్పందం చేసుకుందన్నారు. ప్రస్తుతం క్వారీని లీజుకు ఇచ్చినట్లు చెబుతోందని, గ్రామ అవసరాలకు కంకర ఇచ్చేది లేదని అంటోందని ఆరోపించారు. ఒప్పందం ప్రకారం గ్రామ అవసరాలకు కంకర, ఇతర ముడి సరుకు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. రాంపూర్ గ్రామ శివారులోని స్టోన్ క్రషర్ యాజమాన్యం నిబంధనలను అతిక్రమిస్తూ బ్లాస్టింగ్‌లను నిర్వహిస్తోందన్నారు. మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాల్సిందే



మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఎంఆర్‌పీఎస్ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహిపాల్, ఉపాధ్యక్షులుగా రమేశ్, ప్రదీప్, ప్రధాన కార్యదర్శిగా ఎల్లం, సుధాకర్, కార్యదర్శిగా ప్రశాంత్, కోశాధికారిగా ప్రవీణ్, వెంకట్‌తో పాటు కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం యాదగిరి మాట్లాడుతూ.. రాజకీయంగా మాల కులస్తులు ఎదిగినందున రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. సమావేశంలో సీనియర్ నాయకుడు కొమ్ము శేఖులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక శాఖ చైర్‌పర్సన్ వెన్నెలకు సన్మానం



వెన్నెల గద్దర్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు నరేందర్‌రెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): తెలంగాణ సాంస్కృతిక శాఖ చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన వెన్నెల గద్దర్‌ను కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని మానెపల్లికి చెందిన జిల్లా నాయకుడు నరేందర్‌రెడ్డితో పాటు పలువురు నేతలు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. సాంస్కృతిక శాఖకు వన్నె తెచ్చేలా వెన్నెల గద్దర్ వ్యవహరిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు.

వెన్నల ప్రమాణానికి హాజరైన నేతలు

చిన్నశంకరంపేట(మెదక్): తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ గుమ్మడి వెన్నల గద్దర్ ప్రమాణ స్వీకారంలో కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో మిర్జాపల్లి మాజీ సర్పంచ్ పోతరాజ్ జనార్దన్, ఓయూ జేఏసీ నాయకుడు మోహన్ నాయక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మైసయ్య, సూరారం గ్రామ నాయకులు స్వామి పాల్గొన్నారు.

ముగిసిన ధ్వజస్తంభం ప్రతిష్ఠ మహోత్సవం

శివ్వంపేట(నర్సాపూర్): గూడూర్‌లో ఉన్న పురాతన సోమేశ్వరాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం కనుల పండువగా ముగిసింది. కొలువైన మహాశివుడికి ఆలయ పండితుడు రాజశేఖర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శిలా ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేపట్టారు. గ్రామస్తులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మొక్కవోని దీక్షతో..

పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వ జూనియర్ కాలేజీ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి ప్రిన్సిపాల్ శశిధర్ మొక్కలు నాటారు. నాటిన మొక్కలను మనం రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర అధ్యాపకులు వేణుమాధవ్, విక్రమ్, ప్రణీత పాల్గొన్నారు. అలాగే యూపీఎస్‌లో హెచ్‌ఎం ఆధ్వర్యంలో ఖాజాపూర్‌కు చెందిన అక్బర్ సహాయంతో కొబ్బరి మొక్కలను కొనుగోలు చేసి పాఠశాల ఆవరణలో నాటారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

– చిన్నశంకరంపేట(మెదక్):



చిన్నశంకరంపేట జూనియర్ కళాశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు



ఖాజాపూర్‌లో...

పది నెలల్లో ఎంతో అభివృద్ధి

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

నిజాంపేట(మెదక్): పదేళ్లలో జరగని అభివృద్ధి పది నెలల్లోనే చేశామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఖాసింపూర్ తండా, చౌకత్‌పల్లి గ్రామాలకు తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల అభివృద్ధికి ప్రజలు సహకరించాలన్నారు. ఎస్‌ఐ వేధింపులకు గురి చేస్తున్నారని మండల కేంద్రానికి చెందిన మహిళ ఎమ్మెల్యేతో మొర పెట్టుకోగా సముదాయించారు. న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ సిద్దరాములు, మాజీ సర్పంచ్‌లు అమరసేనారెడ్డి, నాయకులు సత్యనారాయణ, రాంచందర్ నాయక్, ఇతర నాయకులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్

మాకు న్యాయం చేయండి

రైతుల నిరసన

మెదక్ కలెక్టరేట్: పట్టా భూములను అటవీశాఖ అధికారులు లాక్కుంటున్నారని న్యాయం చేయాలని మెదక్ మండలం బాలనగర్ గ్రామానికి చెందిన బాధిత రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. మెదక్ మండలం బాలనగర్ శివారు సర్వే నంబరు 30లో 50 ఏళ్లుగా తాతముత్తాల నుంచి 100 ఎకరాల్లో పట్టాలు కలిగి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. బ్యాంకుల్లో లోన్లు సైతం తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం ఫారెస్ట్ అధికారులు ఈ భూములను లాక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు చేసుకోకుండా సర్వే పేరుతో అడ్డుకుంటున్నారని వాపోయారు. వాటిని లాక్కుంటే రోడ్డున పడతామన్నారు. ఈ విషయమై ప్రభుత్వం స్పందించి వెంటనే న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాధిత రైతులు పద్మయ్య, శేకులు, వెంకటేశం, సత్తయ్య, పెంటయ్య, విజ్జమ్మ, పోచమ్మ, గోనయ్య, రాములు, నర్సింహులు, దుర్గమ్మ, అంజయ్య, బాలయ్య, యాదమ్మ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రామాయంపేట(మెదక్): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించిన ఘటన పట్టణ శివారులోని మెదక్ రోడ్డులో ఉన్న బ్రిడ్జి వద్ద సోమవారం జరిగింది. మృతుడి ఆనవాళ్లను బట్టి అతడు యాచకుడిగా అనుమనిస్తున్నామని ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోమటిపల్లిలో గుడిసె దగ్ధం



దగ్ధమైన గుడిసె

రామాయంపేట(మెదక్): రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని కోమటిపల్లి వడ్డెర కాలనీలో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో గుడిసె దగ్ధమైంది. వడ్డెర కాలనీకి చెందిన పిట్టల లక్ష్మి తన గుడిసెకు తాళం వేసి కూలి పనికి వెళ్లింది. షార్ట్ సర్క్యూట్ వల్ల ముందుగా పొగలు వచ్చి వెంటనే మంటలు వ్యాపించాయి. నిమిషాల వ్యవధిలో గుడిసె కాలిపోయింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఫైర్ సిబ్బంది రామాయంపేట నుంచి ఫైరింజన్‌తో వెళ్లి మంటలను ఆర్పివేశారు. అప్పటికే లోపలున్న బియ్యం, దుస్తులు, ఇతర వస్తువులు, నగదు కాలిపోయాయి. రోడ్డున పడ్డ బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

● ఘనంగా మహాపడి పూజ



మహాపడి పూజలో హన్మంతరావు, గురుస్వాములు తదితరులు

తూప్రాన్: పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో గురుస్వామి కావేరి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మహాపడి పూజ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంతరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు.పడిపూజ అనంతరం అన్నదానం నిర్వహించారు.



ఆలయంలో దీపకాంతులు

వైభవంగా దీపోత్సవం

సహకార ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం రాత్రి కార్తీక మాస దీపోత్సవం నిర్వహించారు. కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకుని మండల పరిధిలోని చాకరిమెట్లలో ఉన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపాలను వెలిగించారు. అనంతరం భక్తులు మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్):

ధాన్యం కొనాలని రైతుల ఆందోళన

అల్లాదుర్గం(మెదక్): ధాన్యం కొనుగోలు చేయాలని సోమవారం రైతులు ఆందోళన నిర్వహించారు. అల్లాదుర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డిని, తహసీల్దార్ మల్లయ్యను, కొనుగోలు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం ఎందుకు కొనడం లేదన్నారు. 10 రోజులుగా వడ్ల బస్తాల వద్దే పడిగాపులు పడాల్సి వస్తోందన్నారు. ప్యాడి క్లినర్‌లో ధాన్యం వేస్తే తరుగు లేకుండా కొనుగోలు చేస్తామని పీఏసీఎస్ సీఈఓ శివగౌడ్ చెప్పారన్నారు. తేమ, పొల్లు ఎక్కువ ఉండటంతో తరుగు తీస్తున్నారని చెప్పారు. దీనిపై పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి మాట్లాడుతూ, రైతులకు నష్టం కలిగించాల్సి అవసరం ఎవరికీ లేదన్నారు. వడ్లు తెచ్చిన వెంటనే కొనుగోలు చేస్తున్నామన్నారు.



ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను నిలదీస్తున్న రైతులు

నాణ్యమైన భోజనం అందించాలి

పెద్దశంకరంపేట (మెదక్): విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్నం భోజనం అందించాలని ఎంఈఓ వెంకటేశం అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటేశం మాట్లాడుతూ విద్యార్థుల హాజరు శాతం తగ్గకుండా చూడాలని, మధ్యాహ్నం భోజనం సక్రమంగా అందించాలన్నారు. ప్రతీనెల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించడంతో పాటు పాఠశాల బలోపేతానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు రాజేశ్వర్, విజయ్‌కుమార్, విటల్ తదితరులు ఉన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతా ప్రమాణాలు పెంచాలని చిన్నశంకరంపేట ఎంఈఓ పుష్పవేణి కోరారు. సోమవారం చిన్నశంకరంపేట మోడల్ స్కూల్ మీటింగ్ హాల్‌లో మండలంలో ఉన్న పాఠశాలల హెచ్‌ఎంలతో కలిసి ఆమె సమావేశం నిర్వహించారు. మధ్యాహ్న భోజనం బియ్యం, ఇతర సరుకులను హెచ్‌ఎంలు పరిశీలించాకే వంటలు మొదలెట్టాలని తెలిపారు. బియ్యం నాణ్యత లేకంటే వెంటనే వెనక్కి పంపించి నాణ్యతతో కూడిన బియ్యం తీసుకు వచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో చిన్నశంకరంపేట జెడ్పీపాఠశాల హెచ్‌ఎం దీప్లారాథోడ్, గాలయ్య, సాయిరెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నార్సింగి మండల కేంద్రంలో ఎంఈఓ మురళీమోహన్ ఆధ్వర్యంలో హెచ్‌ఎంల సమావేశం నిర్వహించారు.



పెద్దశంకరంపేట: మాట్లాడుతున్న వెంకటేశం

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

పీఆర్‌టీయూటీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం సీఎం సానుకూలంగా ఉన్నారని పీఆర్‌టీయూటీ మెదక్ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం చిన్నశంకరంపేటలో ఆయన మాట్లాడుతూ పీఆర్టీయూటీ రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఉమ్మడి సర్వీస్‌రూల్స్, ప్రభుత్వ పాఠశాలలు అన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకు రావడం, సమగ్ర శిక్షణ ఉద్యోగులకు కనీస వేతనం అందించడం తదితర సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లిగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరమేశ్వర్‌రెడ్డి

సమస్యలు ఆలకించి.. పరిష్కరించాలని..

అర్జీలను స్వీకరించిన ఆర్డీఓ రమాదేవి

మెదక్ కలెక్టరేట్: ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ రమాదేవి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వినతులు స్వీకరించారు. ఈ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. వివిధ సమస్యలపై ప్రజలు తొమ్మిది దరఖాస్తులు అందజేశారు.



అర్జీని స్వీకరిస్తున్న ఆర్డీఓ రమాదేవి

మూఢనమ్మకాలను పారదోలాలి : ఎస్‌ఐ

హవేళిఘణాపూర్(మెదక్): విద్యార్థులు మూఢనమ్మకాలను వీడి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాల్సిన అవసరం ఉందని హవేళిఘణాపూర్ ఎస్‌ఐ సత్యనారాయణ అన్నారు. సోమవారం మండలంలో ఉన్న సర్దనలో మూఢనమ్మకాలు, భూత వైద్యం అంటూ చేసే కుట్రలను మ్యాజిక్ షో ద్వారా సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేశ్ పటాపంచలు చేశారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు చేసినట్లయితే వెంటనే తమకు సమాచారం అందజేయాలన్నారు.



మాట్లాడుతున్న ఫెడరేషన్ కమిటీ సభ్యుడు నరేశ్

సంక్షిప్త వార్తలు

◆ ముమ్మరంగా డేటా ఎంట్రీ

కొడిపల్లి(నర్సాపూర్): కొడిపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ముమ్మరంగా జరుగుతోంది. సోమవారం ఎంపీడీఓ శ్రీనివాస్ కంప్యూటర్ ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ, ఉపాధి కంప్యూటర్ ఆపరేటర్లతో నమోదు చేయిస్తున్నారు. తప్పులు లేకుండా సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీఓ సూచించారు.

◆ చెక్కుల పంపిణీ

పాపన్నపేట(మెదక్): సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప పంపిణీ చేశారు. మండల కేంద్రంలో సోమవారం గ్రామానికి చెందిన గిరిగిల్ల శ్రీనివాస్, శ్రీరాం దుర్గేశ్, బేతయ్యలకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి నిథలాక్షప్ప, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, బొల్లి మల్లయ్య, నరేందర్ గౌడ్, ఖలీం, కిషన్ రెడ్డి, కుమ్మరి పోచయ్య, లక్ష్మణ్, ఛోటు, ఆబెద్, విఠల్, దుర్గేశ్, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రజాపాలనపై ప్రచారం

చేగుంట(తూప్రాన్): తెలంగాణ ప్రభుత్వ ప్రజాపాలన ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా విజయోత్సవ కళాప్రదర్శన కార్యక్రమాలను సోమవారం జెత్రంతండా, అనంతసాగర్, పొలంపల్లి తదితర గ్రామాల్లో నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం, రుణమాఫీ అంశాలను పాటల రూపంలో ప్రచారం చేశారు. సాంస్కృతిక సారధి లీడర్ సిద్ధూ, బృందం సభ్యులు పాల్గొన్నారు.

◆ అధ్యక్షుడిగా లింగం

కొడిపల్లి(నర్సాపూర్): కొట్టాల గ్రామ బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడిగా అంబూరి లింగాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ రాజేందర్, పార్టీ మండల అధ్యక్షుడు రాకేశ్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా గరెబోయిన ప్రభాకర్, వాట్సాప్ ప్రముఖ్‌గా వినయ్, మన్‌కీబాత్ ప్రముఖ్‌గా శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు సాయిరాం, వేణు, అరుణ్‌గౌడ్, రాఘవేంద్ర, మహేశ్, సాయికిరణ్, ఉదయ్‌కిరణ్ తదితరులను సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్‌చార్జి రామణరావు, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, మండల ప్రధాన కార్యదర్శి చల్ల లక్ష్మణ్, కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ ఆలయ నిర్మాణానికి విరాళం

వెల్దుర్తి(తూప్రాన్): సేవాలాల్ జగదాంబ ఆలయ నిర్మాణానికి సోమవారం మాజీ సర్పంచ్ రామకృష్ణారావు రూ.50 వేలు విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణానికి సాయం అందించిన ఆయన్ను శాలువాతో మంగళపర్తి పంచాయతీ పరిధిలో ఉన్న తండావాసులు సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో రేణుకామాత విగ్రహ ప్రతిష్ఠ





హవేళిఘణాపూర్(మెదక్): హారతి ఇస్తున్న అర్చకులు, శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

హవేళిఘణాపూర్(మెదక్): రేణుకామాత విగ్రహ ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో సోమవారం ఘనంగా నిర్వహించారు. జక్కన్నపేటలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మూడు రోజులుగా జరుగుతున్నారు. యంత్ర ప్రతిష్ఠ, పంచదశ సంస్కారాలు, ప్రాణప్రతిష్ఠ, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి కల్యాణం కనులపండువగా చేశారు. పేరూర్ సరస్వతి అర్చకులు దోర్బల రాజమౌళిశర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు.

కనులపండువగా శివపార్వతుల కల్యాణం

సిద్దేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది. మండలపరిధిలోని ముత్తాయికోట యేటా కార్తీకమాసంలో కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఏ యేడు కూడా రంగ రంగవైభవంగా వేదమంత్రోచ్ఛారణల మధ్య కల్యాణం నిర్వహించారు.



నర్సాపూర్: కుంకుమార్చనలో మహిళలు

మహిళల పూజలు

నర్సాపూర్ : ఆలయ పూజారి వీరప్ప గురూజీ ఆధ్వర్యంలో శివాలయంలో పూజలు నిర్వహించారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో మహిళలు సామూహిక కుంకుమ అర్చన గావించారు.